# ఉత్తరం

రమణయ్యగారు ఇంట్లో అడుగుపెట్టగానే భార్య ఒక కవరు చేతికందించింది. పైన తపాలాస్టాంపు చూడగానే అది గుంటూరు నుంచి వచ్చిందని తెలుసుకుని చాలా సంతోషించారు. గుంటూరులోనే అల్లుడు కూతురూ ఉంటున్నారు. ఆ అల్లుడంటేనూ ఆ కూతురంటేనూ ఆయనగారికి తగని ప్రేమ. అందువల్ల ముఖంమీద చెమటయినా తుడ్చుకోకుండా ఆశతో కవరు చించారు. ఆయన చదువుతుంటే భార్య ఆతృతతో గడ్డంకింద చేయి వేసుకుని ఆయనగారి ముఖంలోకే చూస్తూకూర్చుంది. ఆ ఉత్తరములో ఇలా ఉంది:

"మామగారికి, మీకొక ఉత్తరం వ్రాయబోయేసరికి మీ అమ్మాయి శాంత (పేరుకు మాత్రమే లెండి)! అదికాస్తా చించివేసింది. ప్రస్తుతం ఈ ఉత్తరం నా భార్య అయిన మీ అమ్మాయికికూడా తెలియకుండా రాయవలసివచ్చినందుకు చింతిస్తున్నాను. మీరు వెంటనేవచ్చి విషయమేమిటో తేల్చుకోకపోతే పరిస్థితులు విషమించగలవని తెలియజేస్తున్నాను.

ఇట్లు,
మీ అల్లుడు
"వెంకట్రావు"

అది చదవగానే ఆయనగారు ఒక్కసారి అగ్గిరాముడయ్యారు. "ఛీ?.. ఈ ఆడజాతికి బుద్ధిలేదు" అని ఉత్తరం నలిపి నేలకేసి కొట్టారు. ఆయన భార్యకి చదువు రాదు దానిలోని విషయమేమిటో ఆయన చెపితే గాని తెలీదు. ఎవరిచేతనైనా చదివించుకోటానికి ఇంటిగుట్టు రచ్చకెక్కుతుందనే భయం. కాని ఆయన్ని కోపంలో ఉన్నప్పుడు పలకరిస్తే అగ్గిమీద గుగ్గిలంలా, చిటపటలాడతాడు. అందువల్ల కోపం తగ్గేవరకు ఓపికపట్టటం ఆమె నేర్చుకుంది.

రమణయ్యగారు సర్వీసయిపోయిన ఓ యిడి. అసిస్టెంటు. ఆయనగారికి ముగ్గురు కూతుళ్లు. ముగ్గురికీ పెళ్లి చేసేశారు. ముగ్గుర్లోకీ చిన్నమ్మాయి 'శాంత' చాలా మంచిదనీ తెలివయిందనీ ఆయనగారికి మొదటి నుంచీ ఆమెమీద చాలా ప్రేమ. అదిచూచి తక్కిన యిద్దరూ అసూయపడేవారుకూడా నంటే అది ఎంత ప్రేమో ఊహించుకోవచ్చు. అందువల్ల శాంత పెళ్లికి ప్రత్యేకంగా 'స్పెషల్' శ్రమజేసి — తక్కిన అల్లుళ్లతో పేచీ వస్తుందనే భయంతో కట్నంమాత్రం ఎక్కువ ఇవ్వకుండా — వెంకట్రావుకిచ్చి పెళ్లిచేశారు. ఆయన ఆశించినట్లుగానే వెంకట్రావు చాలా మంచివాడు పాపం! శాంతిస్వభావుడే కాక సరసుడుకూడాను. అందువల్ల మామగారికి అతనిమీదకూడా కూతురిమీదలాగే అనురాగం ఏర్పడి పెరిగిపోయింది. అంత తెలివయిందనుకున్న కూతురు కూడా; అంత మంచివాడనుకున్న అల్లుడికి ఎదురు తిరిగిందనగానే ఆయనకి అసలు స్త్రీజాతిలో నమ్మకమే పోయింది. తనంటే ఎంతో గౌరవం చూపేఅల్లుడు ఉత్తరంలో కనీసం నమస్కారాలనికూడా రాయలేదంటే — కూతురు పేరుకుమాత్రమే 'శాంత' అని ఎత్తి పొడిచాడంటే — పాపం! అతని కెంత కష్టం కలిగించిందోనని ఆయన

"హీరాలాల్"

గారు మరీ యిదైపోయారు. కూతురుమీద కోపం పెరిగిపోతూంది. "ఛీ!...ఛీ... అన్యాయంగా ఆ గంగిగోవులాంటివాడి మెడకి యీ రాక్షసిని కట్టాను" అని కూతుర్ని,—అసలు విషయం తెలుసుకోక ముందే — నిందించుకున్నాడంటే ఆయనగారికి అల్లుడిమీదనున్న ప్రేమ అపారమనీ, అనన్యసామాన్యమనీ చెప్పకతప్పదని ఒప్పుకోవాలి. ఆ ఉత్తరం మరీ మరీ చదువుకుని అల్లుడి మనస్సెంత బాధపడిందో ఊహించుకోవాలనిపించింది. విసిరికొట్టిన నేలకేసి చూస్తే అది కనపడలేదు. ఎలా కనపడుతుంది? అది అప్పుడే భార్య తీసి బొడ్లో పెట్టుకుంటేను! భార్యని పిలిచి ఆ ఉత్తరం మళ్లీ చదువుకుని 'ఎంత మంచివాడు కాకపోతే నాకు కబురు చేశాడు?' అని అనుకుని తనకు తానే సంతృప్తిపడ్డాడు. అల్లుడిమంచితనాన్ని తలుచుకుని కూతురిమీద కోపాన్ని దిగమింగాడు. ఆయనకి కోపం తగ్గిందని రూఢి అయింతర్వాత మెల్లగా అడిగింది భార్య: "ఏమిటండీ విశేషాలు?...అమ్మాయి బాగున్నదట్నా?" అని. ఇంకేముంది? అంతమంచివాడనుకున్న అల్లుణ్ణి ఒదిలిపెట్టి, కూతురి విషయం అడిగేసరికి ఆయనకి మళ్ళీ కోపం వచ్చింది. రావటంలో ఇంతకు ముందుకంటే రెట్టింపుకోపం వచ్చేసింది.

"ఆఁ...ఉంటుంది...నువ్వు లేవూ?...మహామ్మాయిలా...అమ్మాయట...అమ్మాయి... సిగ్గులేకపోతేసరి," అని కసిరివేశాడు. ఆయన గొంతు అసలే పెద్దది. కోపంతో గద్దించేసరికి సింహాసనంనుండు లేచేలా ఆమె గజగజ వణికిపోయింది. ఆమె మనసు పరిపరి విధాల పోయింది. ఎలాగైతేనేం ధైర్యంచేసి మళ్లీ అడిగింది. "ఏమయిందండీ.....ఏం తెచ్చింది?" అని. "ఏమయినా తెస్తుంది బుద్ధిలేకపోతే సరి" అంటూ గదిలో అటూ యిటూ తిరగటం మొదలుపెట్టాడు. ఆమెకి మళ్లీ మాటాడానికి ధైర్యం చాలలేదు. కొన్నేపటికి ఆయనే మొదలుపెట్టాడు. "ఏ ఆడదయినా పుట్టింటికి ఉత్తరం రాయమని మొగుణ్ణి బలవంతపెడుతుంది. అల్లుడు ఉత్తరంవ్రాస్తే చించివేసే కూతురుంటుందీ? ... వెంటనేవచ్చి విషయమేమిటో తేల్చుకోమని రాశాడు" అని గదిలో తిరుగు



డిస్ట్రిబ్యూటర్లు: సీతారాంజనరల్ స్టోర్సు (ఏజన్సీస్,) విజయవాడ-1.

# ★ ఉత్తరం ★

ఉన్నవాడల్లా తల చేతుల్లో పెట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు. 'పుత్రవాళ్లు! ఏం ఖేదాలు వచ్చినయ్యో'నని పాపం! ఆమెగారు మరీ ఇదైపోయింది. భర్తని వెళ్లమని బలవంతం చేయటం మొదలుపెట్టింది. ఆయన పనులున్నాయంటే నాలుగురోజులు వాయిదా వేయండని సలహాయిచ్చింది. ఆయనగారు మాత్రం ముందుచూపున్న వాడు గనక ఎందుకైనా మంచిదని ఒక యాభై రూపాయలు జేబులో వేసుకున్నాడు. 'ఈ బండి దాటిపోతే ఆలస్యమవుతుంది. మళ్లీ ఏం ముంచుకువస్తుందో'నని ఆయనగారు ఆదుర్దాకొద్దీ పరుగెత్తినట్లుగా నడవటం మొదలుపెట్టాడు. 'పంతులుగారు పరుగెత్తుతున్నారేం?' అని ఎవరయినా అంటే, అది వినిపించుకోకుండా 'ఇంకో టైమెంతుంది?' అని అడిగి సమాధానంకోసం ఆగకుండానే గబగబా స్టేషనుకి చేరుకున్నాడు. ఎలాగైతేనేం మొత్తంమీద బండి అందుకున్నాడు. బండిలో కూర్చున్న దగ్గర్నుంచీ 'అల్లుడు అలా ఎందుకు రాశాడా?' అని ఆలోచిస్తూనే ఉన్నాడు. కాని ఆ 'లేఖాజననవృత్తాంతం' ఆయనకి అణుమాత్రమయినా అంతుపట్టలేదు. ఎలా పట్టుతుందసలు? అదంతా ఒక నాటకముఖ్యేన! ఆ కథే నాన్నక అదేమిటో ఇప్పుడే తేల్చేస్తాను.

పాపం! శాంతకి ఒకనాడు ఏం పనిబత్తిడి తగిలిందో, కూరలో ఉప్పువేయటం మర్చిపోయింది. ఏతత్కారణంగా అన్నం రుచించకపోవటంవల్ల — వెంకట్రావు అంతకుముందు హోటలుకూడు రుచిమరిగినవాడవటంవల్ల — 'ఇంతకంటే హోటలుకూడే నయం' అని రిమార్కు వేశాడు. అంతేగాని, కూరలో అసలు ఉప్పువేయలేదనే విషయం అతని జిహ్వకి తెలిసిందేకాదు. ఏదో రుచి తగ్గింది అంతే అతనికి తెలిసింది. ఆమెని ఉడికించటానికి, అందరు బాగుండదనే హోటలుకూడే నయమన్నాడు. ఇక శాంతకి రకరకాల ఆలోచనలు రావటం మొదలుపెట్టేనయ్. ఆ రావటంకూడా ఎలా వచ్చినాయనీ — చీమకన్నంలోకి నిప్పు తగిలినప్పుడు చీమలు బయటికివస్తాయే — అలా వచ్చినయ్. 'అందరూ బాగుండదంటుంటే ఈయనగారు హోటలుకూడే నయమంటారేమిటి?' అని ఆమె ఆలోచన. నిజమేమిటో తెలుసుకోవాలి. అంటే తనుగూడా ఒకసారి హోటలుభోజనం రుచిచూడాలి. ఈ నిశ్చయానికి వచ్చేసరికి వెంకట్రావు ఆఫీసుకి వెళ్లనే వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చినప్పుడు చెప్పవచ్చుననుకుంది. కాని అతను వెళ్ళిపోయింతరువాతగాని గుర్తురాలేదు మళ్ళీ. ఆఫీసునుంచి అయిదింటికి బయటపడి స్నేహితులతో తిరిగి చీకటపడితేగాని యింటికిరాడు. అందువల్ల ఏదో ఒకటి తనకుతానే తేల్చుకోవాలనుకుంది. పోనీ ఇవాల్టికి వంటచేసి రేపు ఆయన్నడిగి క్యారియర్ తెప్పించవచ్చుననుకుంది. కాని వెంటనే 'ఇలాఅయితే రోజూ రేపే అవుతుం'దనుకుని ఆనాడే వంటమానుకుని సాయంత్రంకాగానే డబ్బులూ క్యారియరూ ఇచ్చి పనిమనిషిని హోటలుకి పంపింది. 'ఆయనేమీ అనరు చాలామంచివారేగా' అని తనకుతానే సమాధానం చెప్పుకుంది. సరే! మంచివారేనయ్యా! వచ్చేసరికి ఏ ముఖాన ఉంటాడో! చెప్పగానే కోపంవస్తుందేమో! అనుకుంటుండగానే అతగాడు వచ్చాడు. ఆమె మెల్లగా 'లయ' చేసి అతనిఒళ్లో చేరి చెవులో చెప్పింది ఈ ఘనకార్యం. అతగాడు పకపకని ఊరుకోవాలా? పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వాడు. "ఏదో 'పులివెన్న జాతిజున్ను' తెమ్మనటం సహజం. ఇంత చిన్న కోరిక కోరావేం భామామణీ" అన్నాడు. ఎంత తక్కువ కోరికయితే మాత్రం అలా నవ్వితే ఆమెకి చిన్నతనం గాదూ? అయితే ఏం? కోపం రాలేదు. అంతే చాలుననుకుని ఆమె సంతృప్తిపడింది. ఆమెను ఉడికించటానికి ఆమెచేసిన వంటకంటే హోటలుభోజనమే బాగుందన్నాడు. అంతటితో ఊరుకుంటే బావున్నా? తెల్లవారగానే ఉత్తరం రాయటానికి ఉపక్రమించాడు.

"ప్రియమైన మామగారికి - ఇక్కడ అంతా క్షేమము. మీ అమ్మాయికి స్వయంపాకం కంటే హోటలుకూడే బాగున్నదట. వంట చేసే యిబ్బందికూడా తప్పుతుందనే ఉద్దేశంతో హోటలునుంచి క్యారియర్ తెప్పించుకుంటున్నాం. వంట చేయటం భార్యయొక్క 'విధి' అని నేననునుగాని ఆమె కోరిక తీర్చటానికి అవుతున్నందువల్ల ఈ ఖర్చు నేను భరించలేను గనుక - మీరే నెలనెలా పంపిస్తారని ఆశిస్తున్నాను. వంట లేదు కనుక తీరికసమయంలో శాంతి ఏదైనా అల్లికలాంటివి నేర్చుకుంటే వాటిమీద వచ్చే ఆదాయం పోను తక్కిన ఖర్చు పంపించండి. లేక ఆ తీరికసమయంలో ఏమీ తోచక పత్రికలేవయినా తెమ్మంటే ఆఖర్చుకూడా మీరే భరించవలసి ఉంటుందని ముందుగానే తెలియజేయడమయినది.

ఇట్లు,
మీ అల్లుడు.

పరా: వీలైతే మీరుకూడా ఈ భోజనం రుచిచూడటానికి వచ్చి పోవలసిందిగా ఆహ్వానించటమయినది."

అని రాసి కవరు అంటించేసి ఆఫీసుకి పోయేటప్పుడు పోస్టు చెయ్యవచ్చునని జేబులో పెట్టుకున్నాడు. అతను స్నానం చేసేటప్పుడు చిల్లర డబ్బులకోసం వెతికే శాంతకు ఆ ఉత్తరం దొరికింది. పైన మాస్టి తన తండ్రిగారి అడ్రసుంది "స్నేహితులకి రాసే ఉత్తరాలు కూడా చూపిస్తాడే, తండ్రిగారికి రాసే ఉత్తరం చూపించకుండా ఉంచటానికి ఏముంటుంది?" అని శాంతకి ఆలోచన పడింది. భార్యగా తనకు హక్కున్నదని ధైర్యం తెచ్చుకుని కవరు తెరిపించింది. చదువుతుంటే తనకికూడా నవ్వు వచ్చిందిగాని చదవటం పూర్తికాగానే కోపం వచ్చింది. ఆ ఉత్తరం చేతులో పట్టుకుని గబగబా అతని దగ్గరికివెళ్లి "ఏమిటండీ ఈ వ్రాతలు? మంచీ చెడూ, గుట్టూ రట్టూ - ఏమీ తెలియక్కరేమా?" అంటూ రెండు ముక్కలుచేసి నేలకేసి కొట్టింది. ఆ ఉత్తరం ఆమె చేతిలో పడిందని గ్రహించి తేలుకుట్టిన దొంగలాగా ఊరుకునేసరికి ఆమె కోపం మరీ ఎక్కువయింది. "ఏదో దుర్బుద్ధి పుట్టి ఒకపూట తెప్పిస్తే, ఎప్పుడూ తెప్పించమన్నానా?... తెప్పిస్తే మాత్రం రాయాలటండీ..." అని ఏమిటేమిటో సాగదీసింది.

"ఏదో ఇలాంటి కోరికలే కోరుతుంటావనుకో! కాదనటానికి ఒట్టిమనిషిని కాదుగదా! నాదగ్గర డబ్బులేవు గనక .."

"అంత భరించలేనివాళ్లు పెళ్లెందుకు చేసుకోవాలి?" అన్నది శాంత.

"భార్యని భర్త భరించాలి అన్నప్పుడు


## బహుమతి రు. 500
(గవర్నమెంటు రిజిస్టర్డు)
తెల్ల వెంట్రుకలను పోగొట్టును
రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము. మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-
GENERAL LABORATARIES,
(H. O) P. O. Rajdhanwar (H, Bhag.).

భర్తకి భార్య తప్పకుండా వంటచేసి పెట్టాలి."

"మీ తర్కానికి సంతోషించాంలే ఊరుకోండి" అని గట్టిగా మందలించి విసవిసా వెళ్ళిపోయింది. ఆ కోపానికి మనవాళ్ళు ప్రత్యేకంగా పేరుపెట్టి 'ప్రణయకోపం' అన్నారు. ఆ కోపం వచ్చినప్పుడు కాంత అందం రెట్టింపు అవుతుందంటాడు వెంకట్రావు. అందుకేనట మరీమరీ ఉడికించటం. ఇప్పటికిదయిందా? ఆఫీసుకుపోతూ పోస్టాఫీసుకివెళ్లి మామగారికి గాభరాపత్తి వెంటనే బయల్దేరేటట్లుగా మూడుముక్కల్లో ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరమే రమణయ్యగారిని అంత గాభరాపెటింది. ఇది సంక్షిప్తంగా ఆ 'లేఖా జననవృత్తాంతం.'

ఆ ఉత్తరం రాసినవిషయం కాంతకి తెలియనివ్వలేదు. అందువల రమణయ్యగారు ఈ బండికి వస్తారనేవిషయం వెంకట్రావు ఒక్కడికే తెలుసు. ఆయనగారు వచ్చేసరికి తనింటిదగ్గ రుండకూడదు. ఏకాంతంలో కాంతని ఆయన గట్టిగా మందలిస్తాడు. కాంత బెదరిపోయి నిజంచెప్తుంది. మామగారు ఆశ్చర్యపోతాడు. ఇలా ఆలోచించుకుని బండివచ్చే వేళకి ఏదో పనిఉన్నట్లుగా స్టేషను దగ్గర తిరుగుతూ మామగారికి కనబడ్డాడు. ఆయనగారు కొంచెం సమయస్ఫూర్తి గలవారు; అల్లుడు బజార్లో కనబడగానే పలకరించకుండా (ముఖంకూడా చెల్లక) అతడింట్లో లేనప్పుడే వెళ్లి కూతుర్ని గట్టిగా మందలించి, అసలువిషయం తేల్చుకోవాలనుకున్నాడు. వెంకట్రావుకి కావలసింది కూడా అదే! మామగారు ఇంటికివెళ్లటం తను చూస్తూనే ఉన్నాడు.

అనుకోకుండా ఆ సమయంలో తండ్రిగారు వచ్చేసరికి కాంత నివ్వెరపోయింది. ఆయనగారు మాత్రం కూతురిమీద లోపల్లోపల కోపాలు మిరియాలు నూరుతున్నాడు. అందువల్ల కూతురు చాలా మారిపోయినట్లూ, ఇదివరకటి లక్షణాలేమీ లేనట్లూ కనపడింది. 'తను ఉత్తరం చించివేసినా తండ్రిగారెందుకు వచ్చినట్లు?' అని కాంత ఆశ్చర్యపోయింది. అసలు వచ్చింది వేరేపనిమీద కాబోలనుకుని స్థిమితపడి, మర్యాదలు చేసింది. కుర్చీలో కూర్చున్న తరువాత "ఏమిటి నాన్నా! పనిమీద వచ్చావు?" అని నవ్వు తెచ్చుకుంటూ అడిగింది. ఆయనగారొక్కసారిగా "ఏమిటా?....కర్మ...బుద్ధిలేకపోతే సరి" అని అరిచాడు. పాపం! కాంత నిజంగా కంగారుపడింది. చిన్నప్పట్నుంచీ అక్కయ్యలందరికంటే ప్రేమగా పెంచినతండ్రి అంత కటువుగా మాట్లాడేసరికి కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినయ్. ఎలాగైనా ప్రేమతో పెంచిన తండ్రి. ఆయనగారు కోపం కొంత తగ్గించుకుని "ఏంచేశావో చెప్పు. ఎందుకు రాశావీ ఉత్తరం?" అంటూ జేబులోనుంచి ఉత్తరం తీసి యిచ్చాడు. అది చూచేసరికి కాంతకి నవ్వాలో ఏడవాలో తెలిసిందికాదు. అయినా అనవసరంగా తన తండ్రికి తనమీద కోపం తెప్పించినందుకు భర్తమీద నిజంగా కోపం వచ్చింది. ఇంతలోకే వెంకట్రావు వచ్చి మామగార్ని 'ఎప్పుడొచ్చారు?' అని ఎరగనట్టు అడగబోయాడు. నోట్లో మాట నోట్లో ఉండగానే కాంత నిజంగానే తన స్వభావాన్ని విడిచిపెట్టినదై "ఏమిటండీ యీ వ్రాతలు?" అంటూ మీది కెగిరింది.

"ఏమిటిది? ముక్క అర్థంరాకపోతే మింగేసేదానివే నే!" అన్నాడు ఏమీ ఎరగనట్టు వెంకట్రావు. కాంతకి దుఃఖం (అంటే కోపం పట్టలేక) ముంచుకువచ్చి గదిలోకి వెళ్ళిపోయింది. వెంకట్రావుకి యిప్పటికి ఈ ఆగడం చాలనుకున్నాడు. పకపకా నవ్వుతూ ఆమెను వెంబడించాడు. రమణయ్యగారికి అల్లుడినవ్వు అర్థంగాక ఆయనకూడా గది దగ్గరికి వెళ్లేసరికి, వెంకట్రావు కాంతను బుజ్జగిస్తున్నాడు. "అదేమిటి? గమ్మత్తుచేస్తే ఏడుస్తావెందుకు?" అంటున్నాడు. రమణయ్యగారికి గుండె లాగినంతపనయింది. తనింతవరకు 'చిట్టితల్లి'ని తిట్టుకున్నదంతా అనవసరంగా భ్రమపడేనన్నమాట! అయ్యో! అనవసరంగా కాంత మనసు కష్టపెట్టానే, అని నొచ్చుకున్నాడు "దానికయినా హద్దూ పద్దూ ఉండక్కర్లేదూ! మొన్న రాసిందిచాలక యిదిరాసి ఆయన్ని గాభరాపెట్టి యిక్కడిదాకా రప్పించటమెందుకు?" అన్నది కాంత ఏడుపు దిగమింగుతూ "మొన్నటిది మీ నాన్న చూడకుండానే చించేశావుగా. ఇప్పుడు నిజం చెప్పు ఏమంటాడో?" అంటూ అతడు బయటికి వచ్చేశాడు. రమణయ్యగారు "ఏమి" టన్నట్టు కొశ్చెన్మార్కు ముఖంపెట్టి అతనివంక చూశారు. "ఏముందిలెండి. ఇంతకూ అసలు 'ఆ ఉత్తరం' చూచే అదృష్టం మీకు లేకుండా చేసిందికాంత" అన్నాడునవ్వుతూ. కాంత చించివేసిన ఉత్తరాన్ని ఉద్దేశించి కాని, కాంత ఆ ఉత్తరం పారవేయటానికి మనసొప్పక దాచివేసింది. "ఇదుగో అల్లుడుగారి ప్రతాపంచూచి సంతోషించండి" అంటూ ఆ ముక్కలు తెచ్చి తండ్రి కిచ్చివేసింది. "చూశావా! నీకూడా పారవేయ బుద్ధిగాలేదుగదూ!" అన్నట్లు నవ్వాడు వెంకట్రావు ఆమెవంక చూచి. రమణయ్యగారు రెండుముక్కల్ని ఒకచోటచేర్చి చదువుకుని "తప్పదయ్యా! ఇదా అసలు సంగతి. అనవసరంగా గాభరా పెట్టాశే మమ్మల్ని" అన్నాడు నవ్వుతూ. "అనవసరమేమీ లేదండీ. అది లేకపోతే మీ రిప్పుడొచ్చేవారా మా యింటికి?" అన్నాడు వెంకట్రావు.

"నిజమే-నేను వచ్చేవాణ్ని గాదు. ఈ శుభవార్త తెలిసేదికాదు" అన్నాడు కూతురువంక చూస్తూ. అప్పటికప్పుడే కాంతముఖం సిగ్గుతో ఎఱ్ఱబడి, సిగ్గుబరువుతో తల వాలిపోయింది. జేబులోనుంచి యాభై రూపాయలు తీసి అల్లుడికందిస్తూ "మరి అమ్మాయి నెప్పుడు తీసికెళ్ళమంటావు?" అన్నాడు. అతగాడు నసుగుతూ "ఇప్పుడెందుకండీ" అని చివరికి ఆలస్యం చేయటానికి ఉపాయం ఆలోచించి "మీరు అత్తగార్ని తీసుకువచ్చి ఇక్కడే ఒకనెల ఉండండి. తర్వాత మీ యిష్టం" అన్నాడు. ఇప్పుడు కూతురు వంక చూచేసరికి ఇదివరకు పోయినాయనుకున్న లక్షణాలన్నీ మళ్ళీ తిరిగి వచ్చినట్లనిపించింది రమణయ్యగారికి.

ఆయనగారు వెళ్ళింతరువాత వెంకట్రావు కాంతతో అన్నాడు: "చూశావా! మామామగారు మంచి సరసులు నా ఉత్తరానికి నిల్చున్నఫలంగా యాభైరూపాయలు బహుమతిచ్చారు" అని ఆ యాభై రూపాయలు ఎందుకిచ్చారనే విషయమై వాళ్లిద్దరూ ఆనాడు రాత్రివరకూ జగడమాడుకున్నారు. ★



సర్వ గర్భాశయ వ్యాధులను పూర్తిగా పోగొట్టి ఆరోగ్యమును సంతానమును కలుగజేయును. అన్ని చోట్లదొరకును. సీసా రు. 2/8

కృష్ణాలేబరేటరీ, బెజవాడ